# 22

# కథ నడిచింది

"కథల పుస్తకాలు తెగ చదువుతారుగా... ఓ కథ రాయండి మీరు కూడా".

భార్య కాంతం మాటలకి కంగారుపడిపోయాడు ఆంజనేయులు "నేను కథలు రాయడమా?"

"ఏం ఆ మాత్రం రాయలేరా? రోజూ ఎన్నెన్నో పత్రికలు చదువుతూనే ఉంటారుగా?" అదోరకం ఎత్తిపొడుపు కాబోలు. ఇరవై నాలుగ్గంటలూ సీరియల్స్ చూస్తూ టీ.వీ. ముందు కూచునే బదులు పుస్తకాలు చదువుకోరాదా అని మొన్న తను బుద్ధి పొరపాటై అన్నదానికి ప్రతీకారమా ఇది...

"అసలంటూ ఏనాడైనా రాసినవాడినయితే నువ్వడిగినా అందం చందం. ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికెగిరిందిట".

"ఉహూ... తప్పించుకోవడానికి వీల్లేదు. మీకోసం తెల్లకాయితాలూ అరడజను పెన్నులూ కూడా తెప్పించాను పక్కింటి పిల్లాడిచేత" గదిలోంచి తెల్లకాయితాలకట్టా నల్లటి పెన్నులూ తెచ్చి ముందు పెట్టింది. ఏడవలేక నవ్వాడు ఆంజనేయులు. చాలా అరుదైన నవ్వు అది. పాత సినిమాల్లో ఎ.ఎన్.ఆర్.తోనూ, ఎన్.టి.ఆర్.తోనూ పోల్చేసుకున్నాడు తనని తనే ఆక్షణంలో కత్తికంటే కలం మిన్న అని తనలాంటి అభాగ్యుడెవరో ఇలాంటి సందర్భంలో వాపోయి ఉంటాడనిపించింది.

"ఈ ఆరు కలాలూ కాదు కదా మరో ఆరు చేర్చుకుని నన్ను నేను పొడుచుకున్నా ఒక్క కథా బొట్టు కూడా చిందదు నాలోంచి. ఈ కాయితాలన్నీ కలిపి పుస్తకంగా కుట్టిస్తాన్లేకు. రకరకాల ముగ్గులు వేసుకో. పత్రికలవాళ్ళు ముగ్గుల పోటీలు పెట్టినప్పుడు

పంపిస్తూ ఉండు. బహుమతి రాకపోయినా నేను నవ్వను" బతిమాలు తున్నట్టుగా చూశాడు.

"మా అమ్మ నాకు ముగ్గులెయ్యడం నేర్పలేదండీ..."

"మా అమ్మ మటుకు నాకు కథలు రాయడం నేర్పిందా?"

"అయ్యో రామా... కథలూ ముగ్గులూ ఒకటేనా?"

"అమ్మయ్య! ఒకటే కాదని ఒప్పుకున్నావు కదా... ఎవరిదగ్గరన్నా నేర్చేసుకుని వెయ్యొచ్చు ముగ్గులు. కథలు అలా కాదుగా! పుట్టుకతో రావాలి కాంతం... పుట్టుకతో రావాలి" జ్ఞానబోధ చేసేవాడిలా పోజు పెట్టాడు.

"ఏం? మీ చిన్ననాటి విశేషాలు అప్పుడప్పుడు నాకు చెప్తూనే ఉంటారుగా?"

"అయితే ఏవిటి?"

"అయితే ఏవిటా? వాళ్ళ చిన్నప్పటి విశేషాలు కోతికొమ్మచ్చి రాస్తున్నారుగా బాపురమణలు. మీరు రాయలేరా?"

కూచున్న కుర్చీలోంచి దబ్బున కిందపడ్డాడు ఆంజనేయులు. మనసులో బాపురమణల్ని తల్చుకుని చేతులు జోడించాడు.

"నాకు మీరెన్ని దండాలు పెట్టినా వొదిలిపెట్టను" కొంగు బిగించింది కాంతం.

ఈ దండాలు నీక్కాదని సత్యహరిశ్చంద్రుడిని చంపిపుట్టిన వాడిలా నోరు జారితే నవల రాయమని శిక్ష వేస్తుందేమో? భయంతో నోరు నొక్కుకున్నాడు.

"చూడండీ... పోనీ... బాపూరమణలకి పోటీగా మీరెళ్ళి వాళ్ళ మనసులు చిన్నబుచ్చడం ఎందుకుగానీ... రైతన్నలమీదో నేతన్నలమీదో రాయండి. వాళ్ళమీద రాస్తే బహుమతి తన్నుకుంటూ మనింటికే వొచ్చిపడుతుంది".

తన్నడానికెవరూ రాకుండా ఉంటే అంతే చాలు... గొణుక్కున్నాడు లోలోపల.

"ఏవిటి... మీలో మీరే ఆ గొణుగుడు?"

"అబ్బే మరేం లేదు. అన్నదమ్ములంటూ లేనివాడిని. ఒంటికాయి సొంటికొమ్ములా పెరిగానింట్లో. రైతన్నెవరు? నేతన్నెవరు?"

"చాల్లెండి సంబడం. మరీ అంత అమాయకంగా చూడక్కర్లేదు".

"లేకపోతే ఏవిటి కాంతులూ..." అలా పిలిస్తే ఆవిడగారు మురిసిపోయి మనిషంతా వంకర్లు తిరిగిపోయి అసలు విషయం మర్చిపోతుందన్న భ్రమ ఆవరించింది. ఆ భ్రమ తెరలు తెరలుగా కాదు... మెల్లి మెల్లిగా అసలే కాదు... సర్రుమని ఒక్కసారిగా కాయితం చిరిగినట్టు పర్రుమంది.

"నన్ను మీరు మాయ చెయ్యలేరు. పోనీ నేతన్నలు మీకు తెలియదు. రైతన్న గురించి రాయండి".

"నేనేదో పొలంలో పనిచేస్తున్నట్టు మాటాడుతున్నావు అంత తేలిగ్గా".

"మీ తెలివి తెల్లారినట్టే ఉంది..."

భార్య మాట పూర్తికాకుండా మధ్యలోనే అందుకున్నాడు... "చూశావా? నాకు తెలివి తేటలు లేవని నువ్వే ఒప్పుకున్నావు. మరి నన్ను కథ రాయమనడం బావుందా?" దెబ్బ కొట్టాననుకున్నాడు కానీ ఆ దెబ్బ తనకే తగుల్తుందని ఊహించలేదు పిచ్చి మానవుడు.

"కథలు రాయడానికి తెలివి తేటలెందుకండీ... పైగా... మీకు లేనివి కొత్తగా ఇప్పుడెక్కడినించి తెస్తాం? మీరో పదిరోజులు సెలవు పెట్టండి. అవసరమైతే పొడిగించుకుందురు గాని. మా అన్నయ్యకి ఫోన్ చేస్తాను మీరొస్తున్నారని. రేపటికి రైలుకో బస్సుకో టిక్కెట్ తెచ్చేసుకోండి. ఆ పల్లెటూళ్ళో ఆ పొలాల్లో తోటల్లో తిరుగుతూ కథ రాసెయ్యండి".

✧ ✧ ✧

కత్తికంటే కలం మిన్నా అని పాడుకుంటూ కలాలూ కాయితాలూ ఓ చిత్తు నోటు బుక్కూ బట్టల్తో పాటూ సర్ది... బట్టలేవైనా పోయినా పర్వాలేదు గానీ... రాసిన కాయితమ్ముక్కేదీ పోగొట్టుకోకండి అంటూ హెచ్చరికలు జారీ చేసింది కాంతం. కొత్తగా బడికెళ్ళే పిల్లాడిలా బుంగమూతీ బెంగమొహం పెట్టాడు ఆంజనేయులు. "పిల్లల్ని జాగ్రత్తగా చూసుకో. మరి వెళ్ళొస్తా..." తల్లికి చెరోవైపూ అంటిపెట్టుకు నిలబడ్డ పిల్లలిద్దరి చూపులూ బలిపశువుని చూసినట్టు చూస్తున్నట్టుగా అనిపించింది అతని బాధాతప్త హృదయానికి.

✧ ✧ ✧

"అది కాదు బావా... చెల్లాయి తప్పేంలేదు. నువ్వు కనపడ్డ పత్రికల్లా చదువుతావు కదా... ఓ కథ గిలికి పారెయ్యలేవా?"

"నేను అర్జునుడు... నువ్వు క్రిష్ణుడివీనా? అయ్యిందా కథోపదేశం..." అప్పటి వరకూ ఊపిరి తీసుకోడానికి తక్కువ సమయం ఉపన్యాసానికి ఎక్కువ సమయం తీసుకుని ఆయాసపడిపోతున్న బావమరిది గోవర్ధన్ వైపు సీరియస్‌గా చూశాడు ఆంజనేయులు.

"నువ్వు గోవర్ధన్‌వి కదా... గోవర్ధనపర్వతం ఎత్తమంటే ఎత్తగలవా?" "రోలు కూడా ఎత్తలేను".

"చూశావామరి... నా పరిస్థితీ అలాగే ఉంటుంది కథ రాయమంటే" తేల్చేశాడు చప్పరించి.

"నిన్ను నువ్వు చిన్నబుచ్చుకోకు బావా... ఏ పుట్టలో ఏ పాము ఉందో ఎవరు చెప్పగలరు? పొలం గట్లంట తిరుగు..."

మాట పూర్తవకుండా మధ్యలోనే అడ్డుపడ్డాడు.

"పాముల్ని వెతుక్కుంటూనా?"

"ఉండు బావా చెప్పనీ... పొలంగట్లంట తిరుగు.... కాలవగంట్లంట కూచో..."

"దేనికీ... దీనికా..." రెండు వేళ్ళు చూపించాడు.

"మరీ అంతలా తీసిపడెయ్యకులే నా మాట. మావగారికి సీరియస్‌గా ఉందని కబురిప్పుడే వొచ్చింది మరీ. కుటుంబ సమేతంగా నేను వెళ్ళక తప్పదు మరీ".

"వెళ్ళిరండి మరీ..." బావమరిదిని అనుకరిస్తూ దీర్ఘం తీశాడు ఆంజనేయులు.

"నీకే ఇబ్బందీ కలక్కుండా ఇంట్లో అన్నీ చూసుకుంటూ... వండిపెట్టేందుకు సోమేశ్వరం ఉన్నాడు... దేనికీ మొహమాటపడకు. నీ ఇల్లే అనుకో... నీ ఊరే అనుకో..."

"కథ రాసిచ్చేందుక్కూడా ఎవడైనా ఉంటే ఇంకా బాగుండేదిగా" నిరాశా నిస్పృహలతో మనసు మూలగడం పైకి వినపడుతుందా... కనపడుతుందా?

✧ ✧ ✧

పొలం గట్లంట తిరుగుతుంటే బాగానే ఉంది ఆంజనేయులుకి. పల్లెటూరి అందాలు ప్రకృతిలోనే కాదు పొలం పన్లు చేసే ఆడంగుల్లో కూడా కనపడటం మొదలైంది. కాంతాన్ని తిట్టుకోడం మానేసి... కాంతామణుల పరిశీలనలో పడ్డాడు. ఓ చేతిలో కలం మరో చేతిలో ఓ నోటుబుక్కూ. "బొమ్మలేస్తారా అయ్యగారూ?" దగ్గరగా వచ్చిందో పడుచు. గబగబా తల అడ్డంగా ఊపాడు. ఒక్కక్షణం అనిపించింది... బొమ్మలెయ్యడం వచ్చినా బాగుండిపోను... ఈ పల్లెటూరి పడుచందాలు గీసేసే వాడుగా ఈ పాటికి! ఇరవయ్యేళ్ళకి తక్కువుండదు వయసు... అంచనా వేసుకున్నాడు మనసులో "ఇలా కూచో వొచ్చి" చెట్టుకింద తను కూచుంటూ పిలిచాడు. భయం భయంగా చూస్తూ ఒద్దికగా వొచ్చి పక్కనే కూచుంది.

"ముందు నీ పేరు చెప్పు... తర్వాత నీ జీవితం చెప్పు".

"నా పేరు చంద్రి... జీవితం ఏంటండీ?"

"అదే... నీ బతుకు..." తన మాట తనకే ఏదో తిట్టులా వినిపించి నాలిక్కొరుక్కున్నాడు. అది ఉత్తుత్తినే అని ఆ పళ్ళకేం తెల్సు? గట్టిగానే కొరికాయి మండింది నాలిక.

"నాలాంటి బతుకెవ్వరికీ వొద్దండీ..." రెండు చేతుల్లో మొహం కప్పేసుకుంది. అయ్యబాబోయ్! ఏడ్చేస్తోందా? తనేమన్నాడనీ? నీ బతుకు నాక్కావాలని అడిగాడా? పిచ్చి మొహంలా ఉందే? ఇంకానయం దరిదాపుల్లో ఎవ్వరూ లేరు.

"మా అమ్మ అయ్య నా చిన్నప్పుడే చచ్చిపోయారు. ఉన్నది అమ్మమ్మే నాకు. ముసలిదైపోయింది. నా మనువు చెయ్యగలదా?" కొంగుతో కళ్ళు తుడుచుకుందో చెంపలమీద చెవట తుడుచుకుందో తెలియలేదు ఆంజనేయులుకి. జాలిమాత్రం నిజంగానే వేసింది.

"ఊరుకో... బాధపడకు... నేనున్నానుగా?"

ఏ మాత్రం చెమ్మలేని కళ్ళతో నవ్వుతూ చూసింది. అయ్యబాబోయ్... ఇదేంటీ!... ఇలాంటి డైలాగొచ్చింది తన నోట్లోంచి... తడబడిపోయాడు. తూనా బొడ్డూ అందామంటే అననిచ్చిందా పిల్ల?... అయస్కాంతమై అంటుకు పోలా?

✧ ✧ ✧

మూడో రోజు కాంతం ఫోను "ఏవండీ ఎంతవరకొచ్చిందీ?"

"ఇదిగో... ఇప్పుడిప్పుడే రక్తి కడుతోంది".

"ఓహోహో... రచయిత అయిపోయారుగా... మీ భాష కూడా మారిపోతోంది. నే చెప్పలా? మీరు రాసెయ్యగలరు. ఆంజనేయస్వామి తన శక్తి ఎరగనట్టూ..." చెప్పుకు పోతోందావిడ. ఔనౌను... మా ముత్తాతకిద్దరు... మాతాతకిద్దరు... నాకూ అంతశక్తి ఉందని మరిచేపోయానిన్నాళ్ళూ...

"ఏవిటి మాట్లాడరూ? ఎప్పుడొస్తున్నారు?"

"తొందరేముంది? సెలవు పొడిగిస్తాను".

"కథ ముగించాక నవల కూడా రాద్దామనుకుంటున్నారా?"

"అలా చెయ్యమంటావా?"

"నవల కూడా రైతన్నలమీదే రాస్తే ఎలాగండీ?"

"మరెలాగ? గ్రంథసాంగుడినవుదామనుకుంటున్నాను..."

"అయ్యో రామ! గ్రంథం రాస్తే గ్రంథసాంగుడంటారనుకుంటున్నారా? అది వేరే అర్థంలో వాడతారండీ బాబూ!" తను ఒలకబోసే సిగ్గు ఆ ఫోన్లో కనపడదని తెలిసి కూడా తెగ మెలికలు తిరిగిపోయింది కాంతం.

✧ ✧ ✧

"చెల్లాయ్... కాంతం... మీ ఆయన్నింక మీ ఊరొచ్చెయ్యమని ఫోన్లో చెప్పు తల్లీ" ఆ ఒక్క ముక్కా ఉంది ఊర్నించి వెంకన్న పట్టుకొచ్చిన చీటీలో.

"ఈ చీటీ ముక్క ఇమ్మని బస్సు ఛార్జీలిచ్చి పంపించాడా మా అన్నయ్య?" విడ్డూరంగా చూసింది. రాకరాక బావగారు... ఇంటల్లుడు... వాళ్ళ ఊరొస్తే బావమరిది చూపించాల్సిన మర్యాద ఇదేనా? రాను రాను అన్నయ్యకి బొత్తిగా ఇంగిత జ్ఞానం లేకుండా పోతోంది. పోతాడనుకున్న వాళ్ళ మామగారు పిడిరాయల్లే లేచి కూచున్నాడు. ఇంక దిగులేముందీ? వెనక్కి చేరుకున్నాడింటికి. నెత్తిన పెట్టుకు చూసుకోవద్దూ బావగార్ని? ఇంక దయచెయ్యమంటాడా? ఆ మాట కూడా ఇక్కడినించి తనచేత చెప్పిద్దామని చూస్తున్నాడా? చెల్లెలన్నా చెల్లెలి భర్తన్నా అంత లోకువా? హూ... సమాధానం చెప్పి పంపలేదు వెంకన్నచేత కాంతం. ఇనపచువ్వల్లే బిగుసుక్కూచుంది. మర్నాడు మోగిన ఫోన్లో మొత్తుకున్నాడు అన్నగారు.

"ఏవిటన్నయ్యా మరీనూ... బహుమతి తెచ్చుకునే కథ రాయాలంటే అక్కడి వాళ్ళ కష్టసుఖాలు చూసి తెలుసుకోడానికి సమయం పడుతుంది కదా? అయ్యాక ఆయనే వొస్తార్లే".

"అయ్యిందమ్మా... అంతా అయిపోయింది. ఇంకా బావగారీ ఊళ్ళోనే ఉంటే ఇంకెంతమంది కష్టసుఖాలు చూస్తారోనని భయంగా ఉంది నాకు. రేపటికి టిక్కెట్టు కొనేశాను" గబగబా చెప్పేశాడు.

ఎంతమంది కష్టసుఖాలు చూస్తే అంత బాగా కథ పుడుతుంది కదా! ఈ అన్నయ్యేవిటి ఇలా మాట్లాడతాడు... ఆ మధ్య ఓసారి వొదిన్ని ఇరవై రోజులు ఇక్కడ ఉండమని కుట్లు అల్లికలు నేర్పి పంపలేదు తను! ఒకరి కొకరు ఆ మాత్రం చేసుకోక పోతే ఎలా? అదే మాట కాస్త కోపం మిళాయించి అడిగేసింది. "ఒకరికొకరు అండగా ఉండద్దా?"

"సిగ్గు సిగ్గు అలా మాట్టాడకు తల్లీ!"

సిగ్గు సిగ్గు అంటూ సిగ్గులేకుండా ఆ మాటేవిటో మధ్యలో... అర్థం కాలేదామెకి. విసుగ్గా అరిచింది "బహుమతి అన్నయ్యా బహుమతి వొస్తుంది".

"ఎంతమ్మా బహుమతి రొఖ్ఖం?"

"అయిదువేలన్నయ్యా?..." గర్వంగా చెప్పింది అందుకున్నంత గొప్పగా.

"చూడమ్మా! రేపే పదివేలకి చెక్కు పంపిస్తాన్నీకు... ఇంకెప్పుడూ కథ రాయమని బావగార్ని మా ఊరు పంపించకు. మీ ఆయనకి కథ నడపడమే తప్ప కథ రాయడం తెలియదు" అవతల ఫోన్ పెట్టేసిన చప్పుడు రాగానే చిరాకు పడిపోయింది కాంతం.

బావగారు రచయిత అయిపోయారని అంతకుళ్ళుమోత్తనం పనికిరాదా మనిషికి. ఒకవేళ వొండి వార్చనని మొండికేసిందేమో వొదిన? ఏం చెప్పుకుంటాడు పాపం మొగపీనుగ... ఈయనగారసలే తిండి పుష్టిగలమనిషి... భోజనప్రియుడు... పోన్లే ఎంత రాస్తే అంతే పట్టుకురానీ. మిగిలింది ఏ పాత కథల్లోంచో కాపీ కొట్టమంటే సరిపోతుంది... తనకి తనే సర్ది చెప్పుకుంటూ వొదిన్ని తల్చుకుని మెటికలు విరవబోయి వేళ్ళు నెప్పెట్టి ఊరుకుంది కాంతం.

సుజనరంజని వెబ్ మ్యాగజైన్

◆